

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గానికి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అభినందనలు

బొడ్రాయిబజార్, జనవరి 18 : నూతనంగా ఎన్నికైన సూర్యాపేట పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గానికి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అభినందనలు తెలిపారు. అధ్యక్షుడు జలగం డేవిడ్‌రాజు, ప్రధాన కార్యదర్శి కేశవరపు కరుణాకర్ గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించి అభినందనలు తెలిపారు. స్థానిక క్రైస్తవ సంఘాలన్నీ ఏకతాటిపై నిలిచి క్రైస్తవ సంక్షేమాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా పాస్టర్ ఫెలోషిప్ చైర్మన్ మామిడి సామ్‌సన్, జిల్లా ఎన్నికల కమిటీ చైర్మన్ సాయిని జాకబ్, ఫాదర్ మరియన్న, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడు మీసాల గోవర్ధన్, మీసాల ప్రభుదాస్, లాజర్‌నాయక్, డానియేలు, డేవిడ్‌రాజు, యేసు రత్నం, మత్తయి, రమేశ్‌బాబు, రాజు, ఏసుపాదం, ప్రసన్నకుమార్, మనిదాస్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ ఉర్సుకు రండి

కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దర్గా ముజావర్ ఎస్‌డీ జానీ

సూర్యాపేట, జనవరి 18 : ఈ నెల 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే జాన్‌పహాడ్ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌ను ఉర్సు కమిటీ ఆహ్వానించింది. గురువారం కలెక్టరేట్‌లో దర్గా ముజావర్ ఎస్‌డీ జాని, కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

సూర్యాపేట : ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024 స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రెండు రోజులు పాటు ఉదయం 10 గంటల నుంచి బూత్ లెవల్ అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటితో పాటు ఓటరు జాబితాలో పేరు, చిరునామా సవరణలు చేసుకోవచ్చని వెల్లడించారు. శాసన సభ నియోజక వర్గం పరిధిలో ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటు మార్పు చేసుకోవచ్చన్నారు.

ముగ్గులు, కబడ్డీ పోటీలు..

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22, 23 తేదీల్లో మండల స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గాల వారీగా బీఎల్‌ఓలు, స్థానిక ఉద్యోగులకు కబడ్డీ పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సిటిజన్ బడ్డీని సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట, జనవరి 18 : పౌర సేవల కోసం సిటిజన్ బడ్డీ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 14, 36వ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సిటిజన్ బడ్డి ద్వారా పౌర సేవలు, ఫిర్యాదులు, ఆన్‌లైన్ సర్వీసులు, పన్ను చెల్లింపులు, ప్రకటనలు, సలహాలు, సూచనలు తదితర అంశాలను తెలుకోవచ్చని చెప్పారు. శానిటైజేషన్, నీటి సరఫరా, వీధి లైట్ల సమస్యలు ఉంటే ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

సూర్యాపేట మున్సిపాలిటీలో పర్యటించి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మేళ్లచెర్వు, జనవరి 18 : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సంపతి పర్వతాలు కుమారుడు శివ(30) కొంతకాలంగా తండ్రి మాట వినకుండా జులాయిగా తిరుగుతూ మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడికి పెళ్లి కాలేదు. మృతుడి అన్న గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చిలుకూరు మండల సమగ్రాభివృద్ధికి కృషి

- కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నలమాద పద్మావతి

చిలుకూరు, జనవరి 18 : మండల సమగ్రాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వేసవికాలం వస్తున్నందున తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం బేతవోలులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతీకోటయ్య, జడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, వైస్ ఎంపీపీ జనపనేని జానకి, తాసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఈదయ్య, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

- తాసీల్దార్ శ్రీనివాస్‌రావు

నూతనకల్, జనవరి 18 : త్వరలో జరుగబోవు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నిక కోసం పట్టభద్రులంతా ఫిబ్రవరి 6 లోపు ఓటు నమోదు చేసుకోవాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తాసీల్దాదర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2020 నవంబర్ 1 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హులని తెలిపారు. ఓటు నమోదుకు ఫారం-18 పూర్తి చేసి డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్ సెట్‌తో నేరుగా తాసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీటీ శ్రీధర్ పాల్గొన్నారు.

మోతె : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకోవాలని తాసీల్దార్ ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నమోదు చేసుకున్న వారు కూడా మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించారు.

అర్వపల్లిలో హిందూ ముస్లింల ఐక్యతా సమావేశం

అర్వపల్లి, జనవరి 18 : మండల కేంద్రంలో బీసీ పోరాటాల వేదిక జిల్లా అధ్యక్షుడు దడిపల్లి వెంకట్ ఆధ్వర్యంలో గురువారం హిందూ ముస్లిం ఐక్యతా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జై భారత్ జాతీయ ఉపాధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ 91 ఏండ్ల క్రితం దేశం కోసం ప్రాణాలు అర్పించారని ఒకరు గీతని, మరొకరు ఖురాన్‌ను పఠిస్తూ ధీరులుగా ఉరికంబానికి నడిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీడీఓ పెరుమాళ్ల వెంకటయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, ఎంసీపీఐ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఈదుల వీరపాపయ్య, ఓయు జేఏసీ నాయకులు వంశీ, సురేష్, మల్లయ్య, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు

నూతనకల్, జనవరి 18 : మండలంలోని మాచనపల్లి గ్రామంలో గురువారం అయోధ్య రాముడి అక్షింతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలు, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు బోల్క కోమరయ్య, బ్రాహ్మండ్లపల్లి మధు, చామకూరి రమేశ్, బ్రాహ్మండ్లపల్లి భవానీశంకర్, వాంకుడోతు కోటేశ్‌నాయక్, మొరిగాల గణేశ్, శ్రీను, మహేశ్ పాల్గొన్నారు.

నాగారం, జనవరి 18 : అయోధ్య రాముడి తలంబ్రాలను ధర్మ జాగరణ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పేరబోయినగూడెం గ్రామంలో భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు కాశీ వేణు శాస్త్రీ, సతీశ్, వెలుగు రమేశ్, ప్రశాంత్, శిరస్సు వెంకన్న, కొమిరెల్లి పాల్గొన్నారు.

నాగారం గ్రామంలో అక్షింతలు అందజేస్తున్న భక్తులు

పత్తికి మద్దతు ధర కల్పించాలి

- సీపీఎం మండల కార్యదర్శి సత్యనారాయణ

నడిగూడెం, జనవరి 18 : పత్తికి మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని వేణుగోపాలపురంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారులతో పత్తి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి క్వింటాకు రూ.10,500 నుంచి 11,500 వరకు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దళారుల కారణంగా కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో రేఖ తిరుపతయ్య, కిన్నెర వెంకన్న, దండా లక్ష్మయ్య, సంపత్, పిచ్చయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి సత్యనారాయణ

రామలింగేశ్వర ఆలయ కమిటీ

తూముల వీరస్వామి

మునగాల, జనవరి 18 : మండల కేంద్రంలోని రామలింగేశ్వర, హనుమాన్ ఆలయ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నల్లపాటి శ్రీనివాస్, కందిబండ సత్యనారాయణ, కొప్పుల వెంకటనర్సింహారెడ్డి, అధ్యక్షుడిగా తూముల వీరస్వామి, గౌరవ సలహాదారులుగా కాసర్ల కోటేశ్వర్‌రావు, చింతకాయల ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా ఉప్పుల జానకి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంధం అంజయ్య, సహాయ కార్యదర్శిగా వేట శేఖర్, కుపిరెడ్డి నవీన్‌రెడ్డి, కోశాధికారిగా మరువాడ ఆంజనేయశర్మ, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

సూర్యాపేట లీగల్, జనవరి 18 : భార్య హత్య కేసులో దోషిగా తేలిన భర్తకు న్యాయస్థానం గురువారం జీవిత ఖైదు విధించింది. కేసు వివరాలు.. నూతనకల్ మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన రాగిరి లింగన్నకు హుజూర్‌నగర్ మండలం లక్కవరం గ్రామానికి చెందిన బొమ్మగాని లావణ్యకు 2015 జనవరి 31న వివాహమైంది. వారి కాపురం ఏడాది పాటు సజావుగానే సాగింది. ఎప్పుడైతే లింగన్న అక్క కూతురికి విడాకులయ్యాయో అప్పటి నుంచి వారి కుటుంబంలో మనస్పర్థలు మొదలయ్యాయి. 2016 జూన్ 22న ఇంట్లో గొడవలు జరుగడంతో లావణ్య బంధువు ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి తెలిపాడు. వెళ్లి చూడగా అప్పటికే లావణ్య మృతిచెంది ఉండడంతో తండ్రి బొమ్మగాని సైదులు నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆకుల ఉమ, రాగిరి లింగన్న, రాగిరి సోమమ్మను నిందితులుగా పేర్కొంటూ తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.లక్ష్మణ్ అభియోగపత్రం దాఖలు చేశారు. 14 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం ఉమ, సోమమ్మలపై కేసును కొట్టివేసింది. కాగా దోషిగా తేలిన లింగయ్యకు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లింగయ్య వాదనలు వినిపించారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

నేరేడుచర్ల, జనవరి18 : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. మున్సిపాలిటీ పరిధిలో దోమలు అధికంగా ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇంటిపన్నుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యం విషయంలో లేదని విమర్శించారు. అధికారులు అలసత్వం వహించకుండా వెంటనే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫిజియోథెరపీకి పేర్లు నమోదు చేసుకోవాలి

నూతనకల్, జనవరి 18 : ఫిజియోథెరపీ కోసం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంఈఓ రాములునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు గురువారం ఫిజియోథెరపీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళవారం ఎమ్మార్సీ భవనంలో క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, రేపాక లింగయ్య పాల్గొన్నారు.

భూ తగాదాలో దాడి

సూర్యాపేట రూరల్, జనవరి 18 : భూ తగాదాలో దాడికి పాల్పడ్డ ఘటన మండంలోని కాసరాబాద్ గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ లింగమ్మ, సాయిలు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అందరికి పెండ్లిండ్లు చేసి భూమి పంచి ఇచ్చాడు. చిన్న కూతురుకి ఇచ్చిన ఎకరం పొలానికి కొడుకు నాగయ్య పొలం నుంచే నీరు పారాలి. అయితే నాగయ్య తన సోదరి పొలానికి నీరు బంద్ చేయడంతో స్థానికంగా ఉండే అక్క హైదరాబాద్‌లో ఉండే చెల్లికి బుధవారం సమాచారం అందించింది. గురువారం భర్తతో కలిసి పొలానికి వచ్చి చూసి నీళ్లు ఎందుకు రానివ్వడం లేదని అన్నను అడిగింది. ఇరువురు మధ్య మాటామాట పెరిగి ఘర్షణ తలెత్తింది. దాంతో నాగయ్య అక్కడే ఉన్న ఇనుప రాడ్డుతో బావ కొల్లు వెంకన్న, అక్కాచెల్లెలుపై దాడి చేశాడు. వారు కూడా నాగయ్య అతని భార్యపై ప్రతిదాడి చేశారు. ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. పరస్పర ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు రేబిస్ టీకా పంపిణీ

కోదాడ టౌన్, జనవరి 18 : జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం కోదాడ పట్టణంలోని ఏరియా పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు సహాయ సంచాలకులు అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతు ప్రేమికులు వినియోగించుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

- బొత్తలపాలెం సర్పంచ్ వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వీరారెడ్డి

పాలకవీడు, జనవరి18 : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బొత్తలపాలెం సర్పంచ్ బోగాల వీరారెడ్డి అన్నారు. గురువారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1, 2 ఆధ్వర్యంలో తల్లుల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ వీరారెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం అందుతుందా? లేదా? అని గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పెల్లి బాబు, పంచాయతీ కో ఆప్షన్ సభ్యురాలు భానుమతి, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, జానకమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చివ్వెంల, జనవరి 18 : ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గుంజలూరు శివారులో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 65పై గురువారం జరిగింది. ఎస్ఐ విష్ణు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన ఉప్పలూరి రిషి, గుండిమేడ మురళీకృష్ణ కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గుంజలూరు శివారులో సిమెంట్ లోడుతో రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని అదుపుతప్పి ఢీకొట్టారు. దాంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇరువురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, జనవరి 18 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి వేదమంత్రోచ్చారణల నడుమ పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు జరిపించారు. అనంతరం ఆలయ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సూర్యాపేటలో కార్మిక, కర్షక ఐక్యతా సదస్సు

సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

బొడ్రాయిబజార్, జనవరి 18 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించే కార్మిక, కర్షక ఐక్యతా జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1982లో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె చేయడం జరిగిందని, సమ్మె పట్ల తమిళనాడు ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించి పది మంది కార్మికులను పొట్టన పెట్టుకుందని విమర్శించారు. ఈ సమ్మె పోరాట స్ఫూర్తిగా ప్రతి సంవత్సరం జనవరి 19న కార్మిక, కర్షక ఐక్యతా సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పులుసు సత్యం పాల్గొన్నారు.

గడ్డిపల్లి కేవీకేలో మాట్లాడుతున్న సెరికల్చర్ ఏడీ వీరకుమార్

అవగాహనతో సాగు చేస్తే అధిక లాభాలు

- సూర్యాపేట సెరీ కల్చర్ ఏడీ వీరకుమార్

గరిడేపల్లి, జనవరి 18 : పూర్తిస్థాయి అవగాహనతో సాగు చేస్తే పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని సూర్యాపేట సెరీకల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ వీరకుమార్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో కేంద్రీయ పట్టు పరిశోధనా కేంద్రం, రీజినల్ రీసెర్చ్ సెంటర్ ములుగు ఆర్థిక సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పట్టు పురుగుల పెంపకం చేపడుతున్న రైతులకు మూడ్రోజులపాటు పట్టు పురుగుల పెంపకంపై నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా పట్టు పురుగుల పెంపకం చేపడితే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. పట్టుపురుగుల పెంపకంలో ఆచరించాల్సిన పద్ధతులను తెలుసుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ వినోద్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో 60 వేల టన్నుల పట్టు ఉత్పత్తి అవసరమైతే కేవలం 36 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతుందన్నారు. అనంతరం సెరీకల్చర్ శాస్త్రవేత్త మాధురి పట్టుపురుగుల పెంపకంలో చేపట్టాల్సిన పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ రాఘవేందర్, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నేరాల దర్యాప్తులో ప్రణాళికతో ముందుకెళ్లాలి

- జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు

సూర్యాపేట సిటీ, జనవరి 18 : సైబర్ నేరాల దర్యాప్తులో ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు గురువారం సూర్యాపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ మోసాలపై కేసుల నమోదు, దర్యాప్తు అంశాలపై సమావేశాన్ని నిర్వహించి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సైబర్ మోసాల నివారణకు యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శివశంకర్, అశోక్, మురారి, రాజశేఖర్, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ రవి, డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

సూర్యాపేటలో వసుంధర డైమండ్ రూఫ్ ఎగ్జిబిషన్

ప్రదర్శనలో వసుంధర డైమండ్ రూఫ్ ప్రతినిధులు

బొడ్రాయిబజార్, జనవరి 18 : హైదరాబాద్‌కు చెందిన వసుంధర డైమండ్ రూఫ్ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ గ్రాండ్ హోటల్‌లో గురువారం గోల్డ్ అండ్ డైమండ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. రెండు రోజుల పాటు కొనసాగే నగల ప్రదర్శనను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వసుంధర డైమండ్ మేనేజింగ్ డైరెక్టర్ వసుంధర కోరారు. 25 సంవత్సరాల అనుభవంతో తయారు చేసే ఆభరణాలు మగువల మనసు దోచేలా ఉంటాయన్నారు. తమ వద్ద ఆర్డర్లపై నెక్లెస్‌లు, డైమండ్స్ తయారు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈఎంఐ సౌకర్యం కూడా ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో స్టాల్ మేనేజర్లు మహేందర్, జ్ఞానేందర్, ఖాజా పాల్గొన్నారు.

206 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ హర్షణీయం

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హసేన్

బొడ్రాయిబజార్, జనవరి 18 : ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆవిష్కరిస్తుండడం హర్షణీయమని సీనియర్ న్యాయవాది, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. సమతా సమాజం కోసం, దేశ అభివృద్ధి కోసం జీవితాన్ని దారపోసిన అంబేద్కర్ సేవలను గుర్తించి వారి ఆదర్శం భవిష్యత్ తరాలకు మార్గదర్శనం కావాలని ఆయన బాటలో నడుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి దళితుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు అయిన కోడి లక్ష్మమ్మ భర్త కీ.శే. చిన్న లింగయ్య, వయస్సు 51 సం||, వృత్తి: గృహిణి, నివాసం H.No.2-1-170/2/4/B, S.V.Engineering College, Suryapet ఇచ్చు ప్రకటన ఏమనగా నేను కొనుగోలు చేసినటువంటి ఇంటి యొక్క ఒరిజినల్ దస్తావేజు నం. 4456/2013, దాని యొక్క లింకు దస్తావేజు నెం. 3308/2008, Dated: 24-04-2008, SRO-Suryapet ద్వారా సంక్రమించినవి. ఇట్టి లింకు దస్తావేజు ఇంటి నుండి రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెల్లుచుండగా మార్గమధ్యములో పోయ